# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక **వార్త**

30 ఏళ్ల ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026


## భోళాశంకరుని దర్శనానికి... కదలి వచ్చిన భక్త జనం


శ్రీకాళహస్తీశ్వరాలయంలో దర్శనాలకు నిరీక్షిస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి,మే 23 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం శివభక్తులతో కిట కిట లాడింది. ఆలయ పరిసరాలు పుణ్యక్షేత్రం హరనామస్మరణతో మార్మోగింది. ఇక ఇక్కడకు వచ్చిన భక్తుల తిప్పలు తిప్పలేక, దళారులు సుదర్శనం, సత్వర దర్శనం అంటూ మధ్యపెట్టి తమ వ్యాపారాలను సజావుగా సాగాయి. శ్రీకాళహస్తీశ్వరాలయానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగున ఉన్న తమిళనాడు, కర్నాటకల నుంచి విశేష సంఖ్యలో భక్తులు కదలివస్తున్నారు. దాంతో ఆలయంతో పాటు పట్టణం కిట కిట లాడుతుంది. ఇక్కడి ఆలయంలో నిర్వహిస్తున్న రాహుకేతుదోష నివారణ పూజలు మహిమాన్వితమైనవికావటంతో భక్తులు కదలి తరంగాల్లా కదలి వస్తున్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. వారంలో ఒక్క బుధ, గురువారం తప్ప మిగిలిన రోజుల్లో కనీసం 30వేల మంది దర్శించుకుంటున్నారు. వారికి సమాచారం అందించటంలో దేవస్థానం అధికారులు విఫలమౌతు న్నారు. ఇక ఆలయంలో దళారుల వ్యవస్థ రాజ్యమేలుతుంది. ఇక్కడ భక్తులకు సదుపాయాలు దైవాదీనం అన్నట్లు మారింది.

**వేసవి ఎండలకు తహతహ:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వస్తున్న భక్తులు అత్యధిక భాగం 4వ గేటు ద్వారా వస్తున్నారు. సన్నిధివీది నుంచి టూరిస్టు బస్టాండుకు వెళ్ళు బస్సులు భక్తులను 4వ గేటు ద్వారా దింపి పంపిస్తున్నారు. దాంతో ఈ మార్గం రద్దీ రద్దీగా మారింది. ఇక గత వారం రోజులుగా ఎండలతో భక్తులు తహతహ లాడుతున్నారు. శనివారం భక్తులు పరిపాలనా భవనాల ఎదురుగా ఉన్న షెడ్డుల్లో సెదతీరటం కనబడింది. శనివారం అధికారులు అందించిన సమాచారం మేరకు 30వేలకుపైగా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. రాహుకేతుదోష నివారణ పూజలు 5వేలు దాటాయి. ఇక ప్రత్యేకదర్శన టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు 8వేల మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

### సంక్షోభంను...

# సవాలుగా తీసుకుని ముందడుగు

**- కేవలం 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు - 23 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే బాధ్యత**
**- పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు - డిఫెన్స్ హబ్‌గా రాయలసీమ**
**- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు**



బహిరంగ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి -సభకు హాజరైన ప్రజలు



చిత్తూరు, మే 23 ప్రభాతవార్త: సంక్షోభంలో వున్న రాష్ట్రంను సవాలుగా తీసుకుని ముందడుగు వేసి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. చిత్తూరు జిల్లా యాదమరి మండలం 14 కండ్రిగ గ్రామంలో శనివారం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట్లాడారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడిన కేవలం 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురావడం జరిగిందన్నారు. అలాగే రాష్ట్రంలో 23 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. మరోవైపు పట్టపర్తిలో 5వ తరం యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశామని, యుద్ధాల్లో పాల్గొనే జెట్ విమానాల తయారీ కేంద్రంగా పుట్టపర్తి మారబోతుందన్నారు. అలాగే రాయలసీమను ఓ డిఫెన్స్ హబ్‌గా తయారు చేయడానికి కంకణం కట్టుకుని ముందుకు వెళ్తున్నామన్నారు. మరోవైపు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తున్నదని, విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ వస్తోందని, కర్నూలులో డ్రోన్ సిటీ, ఏరోస్పేస్, స్పేస్ సిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే తిరుపతిలో త్వరలో బుల్లెట్ మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమ రానుందన్నారు. రాయలసీమలో నిరుద్యోగ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టడానికి ఉక్కు పరిశ్రమ, సిమెంట్ ఫ్యాక్టరీలు రానున్నాయన్నారు. అలాగే కర్నూలు జిల్లాలో మరో నెల రోజుల్లో బంగారు గనులను ప్రారంభించబోతు న్నామన్నారు. రాయలసీమ జిల్లాల్లో విరివిగా ఫుడ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు కాబోతుండటంతో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభించనుందన్నారు. రాయలసీమను ఒక లక్ష కోట్ల రూపాయలతో హార్టికల్చర్ హబ్‌గా మార్చడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని, ఇందులో ప్రభుత్వం 40 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, మరో 60 వేల కోట్ల రూపాయలు ప్రైవేటు పెట్టుబడులు వస్తాయన్నారు. అలాగే పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల ఇక్కడ వంట గ్యాస్ కొరత వచ్చిందని, పెట్రోల్, డిజీల్ ధరలు పెరిగాయని ఈ సవాళ్ళను ఎదుర్కోవాల్సి వుంటుందన్నారు. ప్రధాని మోడి 9 అంశాల పొదుపు మంత్రం పాటించాలని చెప్పారన్నారు. రాష్ట్రంలో మహిళల కోసం పని చేసే పార్టీ తెలుగుదేశం పార్టీ అని, మహిళల కోసం తల్లికి వందనం, స్త్రీ శక్తి పథకాలు తీసుకువచ్చామని, అలాగే దీపం పథకం ద్వారా మహిళలకు వంటింటి ఖర్చులు తగ్గించి జీవన ప్రమాణాలు పెంచడం జరిగిందన్నారు. అలాగే వన్‌ఫ్యామిలీ వన్‌ఎంట్రప్రెన్యూర్ కింద మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్ది వారి ఆర్థిక సాధికారిత కోసం పని చేస్తున్నామన్నారు. మరోవైపు చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ పని చేస్తోందని, మహిళలపై జరిగే నేరాల విషయంలో ప్రజా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రులు మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సత్యకుమార్‌లు, టాటా టెలికన్సల్టెన్సీ డైరెక్టర్ కృష్ణమూర్తి, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు పులివర్తినాని, గాలి భాను ప్రకాష్‌రెడ్డి, గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్, జనసేన ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, కలెక్టర్ సుమిత్‌కుమార్, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ తుషార్ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగశశిభూషన్ తదితరులు పాల్గొన్నారు.







## సంజీవని ద్వారా సమగ్ర ఆరోగ్య సేవలు

**- హార్టికల్చర్ రంగంలో రాయలసీమ ప్రపంచస్థాయి కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి**
**- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు**



సమావేశంలో మాట్లాడుతున్న సిఎం

యామదరి, మే 23 ప్రభాతవార్త: సంజీవని ద్వారా ప్రజలకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. యాదమరి మండలం 14 కండ్రిగ గ్రామంలో నిర్వహించిన సంజీవని ఆవిష్కరణ కార్యక్రమంలో శనివారం ముఖ్యమంత్రి హాజరై మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే భావనతో ప్రభుత్వం ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో సంజీవని కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. గత ఏడాది కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన సంజీవని కార్యక్రమం ప్రస్తుతం చిత్తూరు జిల్లాకు విస్తరించామని, ఆగస్టు 15వ తేదీలోపు ఈ కార్యక్రమంను రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో అమలు చేస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి వ్యక్తికి డిజిటల్ హెల్త్ కార్డు రూపొందించడం జరుగుతుందని, గ్రామ స్థాయిలోనే 42 రకాల వైద్య పరీక్షల నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి కుటుంబానికి భవిష్యత్తులో ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థను సైతం తీసుకువస్తామని స్పష్టం చేశారు. అలాగే ప్రతి పౌరుడికి రూ.2.5 లక్షల వరకు ఆరగ్య బీమా సదుపాయం కల్పిస్తున్నామని, అవసరమైతే ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.25 లక్షల వరకు వైద్య సహాయం అందిస్తున్నామన్నారు. మంచి ఆహారం, వ్యాయామం, యోగ, ధ్యానం, ప్రాణాయామం ద్వారా ఆరోగ్యంను కాపాడుకోవాలన్నారు.రాష్ట్రంలో నీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, హంద్రీ-నీవా, గాలేరు-నగరి, సోమశిల-స్వర్ణముఖి లింక్ కాలువ వంటి ప్రాజెక్టులను పూర్తి చేసి రాయలసీమను సస్యశ్యామలం చేస్తామన్నారు. అలాగే రాయలసీమలో పరిశ్రమలు, డేటా సెంటర్లు, డ్రోన్ సిటీలు, ఏరోస్పేస్ హబ్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అలాగే హార్టికల్చర్ రంగంలో రాయలసీమను ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అధికారులు ప్రజలకు జవాబుదారీ తనంతో పి చేయాలని, అధికారుల పనితీరును సైతం డిజిటల్‌గా మానిటరింగ్ చేస్తామని వెల్లడించారు. వివిధ శాఖల్లో మెరుగైన పనితీరు కనబరచిన అధికారులను సిఎం సభలోనే అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్, టాటా సంస్థ సిఇఓ గిరీష్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.







## మళ్ళీ నేరాలు చేస్తే సహించేది లేదు

**-రౌడీషీటర్లకు కౌన్సిలింగ్‌లో ఎస్పీ సుబ్బరాయుడు**



తిరుపతి,మే 23ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ప్రశాంత తకు, పవిత్రతకు నిలయమని, ఇక్కడ ప్రజలకు యాత్రికులకు పూర్తిభద్రత కల్పించడమే పోలీసు ధ్యేయమని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బ రాయుడు స్పష్టం చేశారు. పోలీస్ చట్టం పవర్, దాన్ని కఠినంగా అమలు చేస్తే ఎలా ఉంటు ందో వివరిస్తూ అవగాహన కల్పించారు. శనివారం రౌడీషీటర్లకు మెగా కౌన్సిలింగ్ చేశారు. ఈ కార్యక్రమానికి సుమారు 450 మంది హాజర య్యారు. తిరుపతి వంటి పవిత్ర ప్రాంతంలో రౌడీయిజం, గంజాయి, మహిళలపై నేరాలు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. ఒకసారి రౌడీ షీట్ ఓపెన్ అయితే ప్రతి కదలికపై పోలీసుల నిఘా ఉంటుంది. మళ్లీ నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్, ఎక్స్ టర్నమెంట్ వంటి కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ప్రజల భద్రత, మహిళలు, చిన్నారుల రక్షణ, నేర నియంత్రణ విషయంలో అత్యంత కట్టుదిట్టంగా వ్యవహరిస్తోందని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంత వాతావరణం కల్పించడం తమ బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు,అదనపు ఎస్పీ రవిమనో హరచారి, శ్రీనివాస్ (క్రైమ్స్), డియస్పీ లు భక్త వత్సలం, గీతా కూమారి, శ్రీలత, సిఐలు, ఎస్సైలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




### కమిషన్ల కోసం...

# కక్కుర్తి పడే నైజం,నాది కాదు!

**- అవినీతిపై ప్రమాణానికి సిద్ధమా**
**- అధికారుల బదిలీలో కమిషన్లు**
**- ఇసుక, గ్రావెల్, మట్టి త్రవ్వకాలకు కమిషన్లు**
**- తిరుమల సిఫారసు లెటర్లకు కమిషన్లు**
**- నెలవల ఇది నీ కుటుంబం నైజం**
**- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

సూళ్లూరుపేట, మే 23 ప్రభాతవార్త: ఇటువంటి కమిషన్లకు కక్కుర్తి పడే నైజం నాది కాదంటూ సూళ్లూరుపేట నియోజకవర్గ వైసిపి సమన్వ యకర్త, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కుటుంబంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం సూళ్లూరు పేటలోని వైయస్సార్సీపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధిని పక్కకి నెట్టి, అవినీతిని పెంచి పోషిస్తుంది నెలవల కుటుంబమే అని ఆయన చెప్పారు. అవినీతి విషయమైతాను శ్రీ చెంగాలమ్మ దేవస్థానంలోనూ, తిరుమల వెంకటేశ్వర స్వామి సన్నిధిలోను, కాణిపాకం వినాయక స్వామి సన్నిధిలోను ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఇందుకు మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం సిద్ధంగా ఉన్నాడా అని సంజీవయ్య సవాల్ విసిరారు. తాను సుబ్రహ్మణ్యం కుటుంబంపై చేసిన అవినీతి ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. అభివృద్ధి విషయమై తాను ప్రశ్నిస్తే అందుకు నేరుగా సమాధానం చెప్పకుండా, తనను నెలవల నువిమర్శించే స్థాయి లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తాను నిరుపేద కుటుంబంలో జన్మించానని, గుడిసి స్థాయి నుంచే నిజాయితీగా రాజకీయంగా ఎదిగానని తన తండ్రి రాజయ్య, తన మామ మాజీ మంత్రి పసల పెంచలయ్య చూపిన మార్గంలోనే నడుస్తూన్నా న్నారు. ఉద్యోగానికి రాజీనామా చేసి నిజాయితీగా రాజకీయాలు చేస్తున్నాన న్నారు. నెలవల సుబ్రహ్మణ్యం లాగా ఎంపీగా పోటీ చేసేటప్పుడు తాను పనిచేసే బ్యాంకులో రుణానికి సంబంధించి సాయం చేసిన స్నేహితులను ఎంపీగా గెలిచిన అనంతరం బెదిరించలేదా అని సంజీవయ్య ప్రశ్నించారు. రాజకీయంగా జన్మనిచ్చిన నేదురుమల్లి జనార్దన్‌రెడ్డిని అవసరం తీరిపోయిన తర్వాత తిట్టలేదా అది నీ నైజం అని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఒక నాయకుని వద్ద బొలెరో వాహనాన్ని, ప్రస్తుతం ఆయన కుమార్తె నెలవల విజయశ్రీ ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే తండ్రి వారసత్వాన్ని పునికి పుచ్చుకొని మరో నాయకుడు దగ్గర వాహనాన్ని తీసుకోలేదా అని చెప్పారు. తండ్రి నెలవల సుబ్రహ్మణ్యం అడుగుజాడల్లో చిన్నప్పటి నుంచి నడుస్తున్న ప్రస్తుత ఎమ్మెల్యే విజయశ్రీ అదే పంథాలో నడుస్తూ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని విమర్శించారు. టీటీడీ బోర్డు మెంబర్‌గా ఉన్నప్పుడు నెలవల సుబ్రహ్మణ్యం పర్చేస్ కమిటీ సభ్యుడిగా ఉండి కమిషన్లు తీసు కొని నాయుడుపేటలో శ్రీనివాస నిలయం అనే ఇల్లు నిర్మించారని చెప్పారు. ఎస్‌టికి సంబంధించిన భూమిని తీసుకొని అక్కడ శ్రీని వాస ఫంక్షన్ హాల్‌ను నాయుడు పేటలో నిర్మించింది నిజం కాదా అని ప్రశ్నించారు. తాను నియోజకవర్గ ఎమ్మెల్యేగా పది సంవత్సరాలు పని చేసానని ఈ పది సంవత్సరాల కాలంలో తాను సంపాదించిన ఆస్తులను, బహిరంగ వేదికలో వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. అలాగే నెలవల సుబ్రహ్మణ్యం రాజకీయాల్లోకి అడుగు పెట్టిన తర్వాత సంపాదించిన ఆస్తులు వివరాలను వెల్లడించేందుకు సిద్ధమాఅని సంజీవయ్య సవాల్ చేశారు.ప్రస్తుతం తిరుపతిలో ఈ రెండేళ్లలో సంపాదించిన అవినీతి సొమ్ముతో మూడు భవనాలను నిర్మిస్తున్నది నిజం కాదా అని అన్నారు. విజయమ్మ నీ తండ్రిని చూసుకో, అమ్మ విజయమ్మ నా ఆరోగ్యం గురించి నువ్వేం దిగులు పడక్కర్లేదు, నేను బాగానే ఉన్నాను. మీ నాన్న ఆరోగ్యం గురించి చూసుకో, స్వయాన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీ తండ్రిని రెస్ట్ తీసుకోమని చెప్పిన ఇంకా అవినీతి సొమ్ము కోసం ప్రాకులాడడం ఎంతవరకు సమంజ సమని అన్నారు. ఇసుక రీచ్‌ల విషయంలోను, రేషన్ బియ్యం దందాలలోమీ అల్లుడు భాగస్వామి కాదా అని నెలవల సుబ్రమణ్య యను ప్రశ్నించారు. ఇప్పటికైనా నియోజకవర్గ అభివృద్ధి విషయంలో మాట్లాడండి అంతేగాని పసలేని ఆరోపణలు చేస్తూ ఖిచెంచాల దగ్గర మాట్లాడిస్తేతాను తీవ్రస్థాయిలో స్పందించాల్సి వస్తుందని కిలివేటి సంజీవయ్య హెచ్చరించారు. మీ సమావేశంలో ఎంపీపీ అల్లూరు అనిల్ కుమార్ రెడ్డి, జెట్టి వేణు యాదవ్, స్వామి రెడ్డి, అలవల సురేష్, చిన్ని సత్యనారాయణ, అయితా శ్రీధర్, మిజూరు రామకృష్ణారెడ్డి, కర్లపూడి సురేష్, ఆబాక రమేష్ రెడ్డి, బి.మోహన్ రెడ్డి, తుపాకుల ప్రసాద్, చిలక యుగంధర్, భగవాన్ దాస్, మాదరపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.






# ఆరోగ్యకర కుప్పంకు అందరూ సహకరించాలి

## - ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, మే 23 ప్రభాతవార్త:




సిఎం చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ఆరోగ్యకరమైన కుప్పం కోసం అందరూ సహకరించాలని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం కుప్పం పట్టణంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంను ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రభుత విప్ మాట్లాడుతూ కుప్పంలో ప్రజల భాగస్వామ్యంతో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంను చేపట్టనున్నట్లు తెలిపారు. గత వైకాపా పాలనలో చెత్తపై పన్ను వేస్తే తమ ప్రభుత్వంలో చెత్తనుంచి సంపద తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణలో ఎపి దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. వచ్చే ఏడాది కల్లా రాష్ట్రంలో ఎక్కడా డంపింగ్ యార్డులు ఉండరాదనేది సిఎం ఆలోచన అన్నారు. కుప్పంలో సైతం డంపింగ్ యార్డు స్థలంలో పార్కు ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. స్వచ్ఛరథం ద్వారా ప్రజలనుంచి వ్యర్థాలు సేకరించి అందుకు తగిన మొత్తంలో ప్రజలకు నిత్యావసర సరుకులు అందించడం జరుగుతోందన్నారు. ప్రజలు కూడా చెత్తచెదారాలు రోడ్లపై పడేయకుండా మున్సిపల్ కార్మికులకు అందించాలని సూచించారు. స్వచ్ఛత అందరి బాధ్యత అనే విషయం గుర్తుంచుకోవాలన్నారు.

కార్యక్రమంలో కమీషనర్ శ్రీనివాసరావు,టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రెస్కో ఛైర్మన్ ప్రతాప్,మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి నబీ, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, ఎంఆర్ సురేష్, సురేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, మాజీ సర్పంచులు గోపీనాథ్, డాక్టర్ వెంకటేష్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, జనసేన ఇన్‌చార్జ్ నరేష్, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో దుప్పి మృతి!

రామకుప్పం, మే 23 ప్రభాతవార్త:



అడవి నుంచి దారి తప్పిన దుప్పిని వీధి కుక్కలు వెంటాడి కరిచి చంపేశాయి. శనివారం ఉదయం కౌండన్య అభయారణ్యంలో నుంచి మండల శివార్లలో బందార్లపల్లి గ్రామ వ్యవసాయ పంట పొలాల్లో మేత కోసం తిరుగుతున్న దుప్పిని వీధి కుక్కలు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని దుప్పిని పశు వైద్యశాలకు తీసుకువచ్చి పంచనామా నిర్వహించి, కేసు నమోదుచేసి అటవీ ప్రాంతంలో ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ జయశ్రీ, ఫారెస్ట్ హరి కుమార్, నిరంజన్, సుబ్రహ్మణ్యం, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## టాటా సంజీవని సేవలు సద్వినియోగం చేసుకోండి

రామకుప్పం, మే 23 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన టాటా సంజీవని సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజాలాపురం వైద్య అధికారి పూజిత తెలిపారు. శనివారం మండలంలోని ఆని గానూరు, బల్ల, సింగసముద్రం , కెంచన బల్ల విజలాపురం గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. 49 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, చికిత్సలకు వచ్చే రోగులు ప్రతి ఒక్కరూ ఈ కార్డును తీసుకోవాలన్నారు. టాటా సంజీవిని 155337 టోల్ ఫ్రీ నెంబర్ లో నమోదు చేసుకొని వైద్యుల అపాయింట్ మెంటు తీసుకోవచ్చు అన్నారు. ఆరోగ్య రికార్డులను డిజిటల్ రూపంలో మార్చడం జరిగిందని దీన్ని రోగులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, ఏఎన్ఎంలు రాధ, అశ్విత, సుకన్య, గ్లోరీ, సంధ్యా, కావ్య, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## మహానాడు విజయవంతానికి టిడిపి నేతల సమావేశం

కుప్పం, మే 23 ప్రభాతవార్త:



కుప్పం పట్టణంలోని అగ్ని మారెమ్మ దేవస్థానం వద్ద ఆదివారం నిర్వహించనున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి నాయకులు, కార్యకర్తలు నిర్ణయించారు. శనివారం 11వ క్లస్టర్ పరిధిలో నిర్వహించిన సమావేశంలో మహానాడు ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, పీఎంకే ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు సూచనలతో ఈ సమావేశం నిర్వహించారు. మహానాడు కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు హాజరుకావాలని, కార్యక్రమాన్ని విజయ వంతం చేయడానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి మహానాడు వేదికగా నిలుస్తుందని, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు సూచించారు. ఈ సమావేశంలో 11వ క్లస్టర్ పరిధిలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విలీనం పేరిట పాఠశాలలు మూత తగదు

### - రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డిశేఖర్‌రెడ్డి

చిత్తూరుహెల్త్, మే 23 ప్రభాతవార్త:



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తక్కువ వున్నారన్న సాకుతో ఆ పాఠశాలలను మూసి వేయడం తగదని రాష్ట్ర వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో ఆరోపించారు. కూటమి ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేటు పాఠశాల అనుకూల విధానాల ఫలితంగా బడుగు బలహీన వర్గాల పిల్లలు విద్యను అభ్యసించలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రాథమిక స్థాయిలో నివాసాలకు దగ్గరగా వున్న పాఠశాలలు మూసి వేయడం వల్ల పిల్లల చదువులు మధ్యలోనే మానివేస్తున్నారని మండిపడ్డారు. పాఠశాల ప్రారంభమైన రోజే విద్యార్థులకు అవసరమైన విద్యా సామాగ్రి అందిస్తామన్నది కేవలం ప్రచార ఆర్భాటమే అన్నారు. తల్లికి వందనం నిధులు గత ఏడాది రూ.8 వేలు, రూ.10 వేలు జమ చేశారని ఆయన మండి పడ్డారు. అలా కాకుండా ఈ ఏడాది తల్లికి వందనం పథకం నిధులు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.15 వేలు తగ్గకుండా జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా వేసవి ఎండలు అధికంగా వుండటంతో జూన్ నెల మొదటి వారంలో నిర్వహించాల్సిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంను వాయిదా వేయాలని ఆయన కోరారు.

## చెస్ క్రీడాకారుడికి పదివేల ఆర్థికసాయం

కుప్పం, మే 23 ప్రభాతవార్త:



అమరావతిలో జూన్ 1నుంచి జరగనున్న అంతర్జాతీయ చెస్ పోటీల్లో పాల్గొంటున్న కుప్పం పాలిటెక్నిక్ కాలేజ్ విద్యార్థి హరీష్‌కు పదివేల రూపాయల ఆర్థికసాయాన్ని దాతలు అందించారు. కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్‌ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, లయన్స్‌క్లబ్ కుప్పం అధ్వర్యంలో ఈసాయాన్ని అందజేశారు. హరీష్ మంచి ప్రతిభ చూపి కుప్పంకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, సభ్యులు సెల్వం, శివ, డాక్టర్ రమేష్, జయరాంనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్‌లో చెలరేగిన మంటలు...

### ఐదుమందికి గాయాలు



కుప్పం, మే 23 ప్రభాతవార్త:

గుడుపల్లె మండలం సోడిగానిపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి కదిరప్ప అనే వ్యక్తి ఇంట్లో గ్యాస్ సిలిండర్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. పూజారి కదిరప్ప నివాసంలో వంట గ్యాస్ సిలిండర్‌లో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్న కదిరప్పను రక్షించేందుకు ప్రయత్నించిన కదిరివేలు (26), జయపాల్ (23), మల్లేష్ (20), జగదీష్(17), కేశవ (26)లకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కుప్పం ఫైర్ అధికారి నేతాజీ నేతృత్వంలో ఫైర్ సిబ్బంది వచ్చి గ్యాస్ మరింత లీక్ కాకు ండా మంటలు అదుపు చేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది.

## మహానాడు ను విజయవంతం చేయండి

రామకుప్పం, మే 23 ప్రభాతవార్త:



టిడిపి మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్ టిసి వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఈనెల 27, 28 తేదీల్లో వర్చువల్ ద్వారా మహానాడు ను జరుపుకోవాలని పార్టీ అధిష్టానం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు శాంతారామ్, టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, గుర్రప్ప, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## 50 లక్షల నిధులతో పెద్ద చెరువు సుందరీకరణ

రామకుప్పం,మే 23 ప్రభాతవార్త:



స్థానిక పెద్ద చెరువును 50 లక్షల నిధులతో సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ తెలిపారు. శనివారం పెద్ద చెరువులో పనులు ప్రారంభించేందుకు పురోహితులు నాగరాజు శర్మ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బ్యూటిఫికేషన్ లో భాగంగా మండలానికి ఒక చెరువును సుందరీకరణకు ఎంపిక చేశారన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను సమకూరుస్తున్నారు. సంక్షేమ, అభివృద్ధిని అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నది కూటమి ప్రభుత్వమేనని ప్రజలు గుర్తించాలన్నారు. ప్రజలందరి సంక్షేమం కోసం కోసం అనేక పథకాలు తీసుకొచ్చి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్న చంద్రబాబు నాయుడుకి అందరూ అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు శాంతారామ్, టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి,ఎంపీపీ సులోచన గుర్రప్ప ,కార్యదర్శి కామరాజు నాయక్, నేతలు సీతాపతి, నారాయణ చారి, చిన్న కృష్ణా, చలపతి, గంట్లప్ప గౌడు, రామకృష్ణప్ప,రవి రెడ్డి,విశ్వనాథ్, సలాం సాబ్ ,మహమ్మద్ రఫీ, రఘు, పద్మనాభ రెడ్డి,అవినాష్ రెడ్డి , మంజునాథ్ రెడ్డి, ఆదిల్, మంజునాథ్, మనోహర్,సురేష్, కృష్ణారెడ్డి, సాగర్ రెడ్డి, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రికి చెడ్డపేరు వస్తే సహించేది లేదు

## -ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, మే 23 ప్రభాతవార్త:



ప్రభుత్వ ఆసుపత్రికి చెడ్డపేరు వస్తే సహించేదిలేదని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హెచ్చరించారు. శనివారం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వద్దకు వెళ్ళి సౌకర్యాలు గురించి విచారించారు. ఆసుపత్రి పనితీరుపై పలువురు రోగులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. తమను పశువుల కంటే హీనంగా చూస్తున్నారని మనుషులుగా గుర్తించడం లేదన్నారు. ఏదైనా అడిగితే సమాధానం చెప్పేవారు లేరని ఒక్కో కలెక్టర్ వలే వ్యవహరిస్తున్నారని వాపోయారు. తాగునీటి సౌకర్యం లేదని వచ్చే నీరు చాలడంలేదని, వేడినీళ్ళు లేక చల్లటినీటితోనే స్నానాలు చేయాల్సి వస్తోందన్నారు. ఒపికి వెళితే గంటల తరబడి చీటీలు ఇవ్వడంలేదని, ఇంజక్షన్లు వేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం చూపుతున్నారని తెలిపారు. వైద్యులు అందుబాటులో వుండడంలేదని గంటల తరబడి తమ ఛాంబర్లలో లేకుండా వెళ్ళిపోతున్నారని ఆరోపించారు. దీంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుసగా వెళ్ళి వైద్యుల ఛాంబర్లు తనిఖీ చేశారు. నీరు వస్తోందా లేదా అని వాటర్ ట్యాప్‌లు తిప్పి చూశారు. ఇంజక్షన్లు వేసే నర్సులను విచారించి ఎక్స్‌రే గదులు, మందుల సరఫరాను పరిశీలించారు. బిపి షుగర్ పరీక్షించే ల్యాబ్‌ను తనిఖీ చేసి మందులు సకాలంలో అందుతున్నాయా లేదా అని విచారించారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పనితీరు మెరుగుపడాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రి కమిటీ చైర్మన్ నాగరాజు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## పలమనేరులో క్లీన్ అండ్ గ్రీన్

పలమనేరు, మే 23 ప్రభాతవార్త:




పలమనేరులో ఆపరేషన్ క్లీన్ స్విప్ పేరుతో శనివారం క్లీన్‌అండ్‌గ్రీన్ నిర్వహించారు. పలమనేరు మున్సిపాల్టీ, పలమనేరు పరిరక్షణ సమితి సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. పెద్దచెరువులో గుర్రపుతొండు, చెరువు గట్టుపై చెట్లు, పొదులు తొలగించి శుభ్రం చేశారు. చెరువులో కంపుగొడుతున్న పూడిక మట్టిని జెసిబిలతో తొలగించారు. అలాగే కూరగాయల మార్కెట్ వద్ద కుళ్ళిన కూరగాయలు, చెత్తకుప్పలు తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ ఎంవి రమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి మూడవ శనివారం ఆపరేషన్ క్లీన్ స్విప్ పేరుతో క్లీన్‌అండ్‌గ్రీన్ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మన ఇల్లు, మన వీధి లాగే మన మునిసిపాల్టీని కూడా శుభ్రం చేసుకొని ఇతర మున్సిపాల్టీలకు అదర్శంగా నిలవాలన్నారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో పలమనేరు మున్సిపాల్టీకి రెండు సార్లు స్వచ్ఛ భారత్ అవార్డు లబించిందని ఇది మరో సారి వచ్చేలా అందరూ కృషిచేయాలని కోరారు. పరిరక్షణ సమితి నాయకులు నరసింహులు, నారాయణ, పొన్నుడి, రామచంద్ర, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేన నేత నెల్లిపట్లకు ఎమ్మెల్యే సంతాపం

బైరెడ్డిపల్లి మే 23 ప్రభాతవార్త:



పలమనేరు జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు హరీష్ రాయల్ తండ్రి, ప్రముఖ వ్యాపారవేత్త నెల్లిపట్ల సుబ్రహ్మణ్యం మృతికి పలమనేరు నియోజకవర్గ శాసన సభ్యులు అమరనాథ రెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సుబ్రహ్మణ్యం శనివారం మృతి చెందారు. బైరెడ్డిపల్లి మండలంలోని నెల్లిపట్ల గ్రామానికి చెందిన స్థానిక టీడీపీ నేతలతో ఎమ్మెల్యే,మృతుని భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం హరీష్ తోపాటు వారి కుటుంబీకులను ఓదార్చి తన సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గిరిబాబు, నాగరాజు, కుమార్, కిరణ్ కుమార్,గోవర్ధన్, జయన్న పాల్గొన్నారు .

## ప్రజల భాగస్వామ్యంతో ఆపరేషన్ క్లీన్ స్వీప్

కుప్పం, మే 23 ప్రభాతవార్త:



కుప్పంలో ప్రజల భాగస్వామ్యంతో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంను విజయవంతం చేయాలని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక హెచ్‌పి రోడ్డులో ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో భాగంగా స్వయంగా రోడ్లపై ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ , కమీషనర్ శ్రీనివాసరావు,టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రెస్కో ఛైర్మన్ ప్రతాప్,మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి నబీ, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, ఎంఆర్ సురేష్, సురేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, మాజీ సర్పంచులు గోపీనాథ్, డాక్టర్ వెంకటేష్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, జనసేన ఇన్‌చార్జ్ నరేష్, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## పకడ్బందీగా మున్సిపల్ వార్డుల పునర్విభజన

### – ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, మే 23 ప్రభాతవార్త:



కుప్పం మున్సిపాలిటీలో పకడ్బందీగా వార్డుల విభజన చేపట్టాలని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆదేశించారు. శనివారం మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశంకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 25 వార్డులను 32వార్డులుగా విభజించే విషయంలో ఎలాంటి పొరబాట్లకు తావివ్వక వార్డుల పునర్విభజన చేపట్టాలని కమీషనర్ శ్రీనివాసరావుకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు వైకాపా కౌన్సిలర్లు మాట్లాడుతూ వార్డుల పునర్విభజన అభినందనీయమని తమకు వార్డుల విభజనకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని సమావేశంలో కోరారు. దీనిపై కమీషనర్ మాట్లాడుతూ ఏదేని సూచనలు, అభ్యంతరాలు ఉంటే ఈనెల 24వతేది వరకు అందించవచ్చన్నారు. అన్ని విషయాలు పరిగణనలో తీసుకుని తుది జాబితాను ఖరారు చేసి జిల్లా కలెక్టర్‌కు పంపడం జరుగుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## డెడ్ లిఫ్టింగ్ పోటీల్లో...

### కుప్పం యువతికి బంగారుపతకం

కుప్పం, మే 23ప్రభాతవార్త:



తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో జరిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా డెడ్ లిఫ్టింగ్ పోటీల్లో కుప్పం పట్టణంలోని అవెంజర్స్ జిమ్‌లో శిక్షణ పొందుతున్న స్వాతి మహిళా విభాగ ంలో బంగారుపతకం సాధించినట్లు జిమ్ యజమాని గజ తెలిపారు. 61కిలోల కేటగిరీలో సందీప్ రెండో స్థానం, 75కిలోల కేటగిరీలో అర్పత్ బంగారుపతకం సాధించాడన్నారు. 85కిలోల కేటగిరీలో గజేంద్ర రెండో స్థానం సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా పోటీల్లో పాల్గొని సత్తా చాటిన వారిని అభినందించారు.

## నారసింహనిపల్లి వద్ద వృద్ధుడు ఆత్మహత్య!

**తవణంపల్లి, మే 23 ప్రభాతవార్త:**

ఆర్థిక లావాదేవిల వివాదంతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నారసింహనపల్లిలో శుక్రవారం రాత్రి జరిగింది. సంఘటనకు సంబంధించి తవణంపల్లి ఎస్ఐ మురళీప్రసాద్ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. ఆర్థిక లావాదేవిల కారణంగా చిత్తూరు రూరల్ మండలం చెర్లోపల్లికి చెందిన ఎన్.రమణారెడ్డి(72) అనే వ్యక్తి నారసింహనిపల్లి గ్రామంలోని ఓ దుకాణం సమీపంలో విషం తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. స్థానికులు ఈ విషయంను గమనించి చికిత్స నిమిత్తం వెంటనే చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కాసేపటికే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ రికార్డు

– కలెక్టర్ సుమిత్‌కుమార్



**చిత్తూరు, మే 23 ప్రభాతవార్త:**

సంజీవని కార్యక్రమం ద్వారా ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ రికార్డు రూపొందిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ వెల్లడించారు. యాదమరి మండలంలో బుధవారం జరిగిన సంజీవని ప్రారంభోత్సవ కార్యక్రమంలో సిఎం నారా చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంకు హాజరైన కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ గత 18 నెలలుగా ఈ కార్యక్రమంను సిఎం నారా చంద్రబాబునాయుడు స్వయంగా సమీక్షిస్తు మార్గనిర్దేశం చేస్తున్నారన్నారు. సంజీవని డిజిటల్ నర్వ్ సెంటర్ కాల్ సెంటర్ ద్వారా ఇప్పటి వరకు 73 వేల మందికి హెల్త్ ఫాలోఅప్ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి కుటుంబానికి నిరంతర వైద్య పర్యవేక్షణ అందించేలా ఆరోగ్యశాఖతో పాటు ఇతర శాఖల సమన్వయంతో మరింత సమర్థవంతంగా ఈ కార్యక్రమంను అమలు చేస్తామన్నారు.

## సంజీవనితో ప్రతి ఒక్కరికి అందుబాటులో ఆధునిక వైద్యం

– ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్

**చిత్తూరు, మే 23 ప్రభాతవార్త:**

గ్రామీణ ప్రాంత ప్రజలకు సంజీవని కార్యక్రమం ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. యాదమరి మండలం 14 కండ్రిగ గ్రామ సమీపంలో బుధవారం జరిగిన సంజీవని కార్యక్రమ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలు డిజిటల్ రూపంలో భద్రపరచి, భవిష్యత్తులో వచ్చే ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించే విధంగా ఈ వ్యవస్థ పని చేస్తోందన్నారు. పేద ప్రజలు వైద్య ఖర్చుల భారంతో ఇబ్బందులు పడకుండా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అలాగే హంద్రీ-నీవా ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమ ప్రాంత హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు.

## సింగిల్‌విండో ఛైర్‌పర్సన్ చిత్రను ఆత్మీయంగా పలకరించిన సిఎం

**యాదమరి, మే 23 ప్రభాతవార్త:**



యాదమరి సింగిల్‌విండో ఛైర్ పర్సన్ చిత్రా నాయుడును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆత్మీయంగా పలకరించారు. యాదమరి మండలం 14 కండ్రిగ గ్రామ సమీపంలో శనివారంసిఎంనారాచంద్ర బాబు నాయుడు సంజీవని కార్యక్రమం ప్రారంభించడానికి విచ్చేసిన సమయంలో సింగిల్‌విండో ఛైర్ పర్సన్ చిత్రానాయుడు సిఎంకు ఎదురుపడి నమస్కరించారు. ఈ సందర్భంగా సిఎం నారా చంద్రబాబునాయుడు సింగిల్‌విండో ఛైర్‌పర్సన్ చిత్రానాయుడును యోగక్షేమాలు అడిగి తెలుసుకుని పార్టీ కోసం మరింత కష్టపడాలని సూచించారు.

## నిషేధిత మందులను అమ్మితే చర్య:వ్యవసాయ అధికారి

**రైల్వేకోడూరు రూరల్, మే 23 ప్రభాతవార్త:**



రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు రైతుల ఆరోగ్య భద్రత, పర్యావరణ పరిరక్షణ మరియు పారాక్వాట్ డైక్లోరైడ్ మందును ఎవరైనా అమ్మితే శాఖపరమైన చర్యలు ఉంటాయని రైల్వేకోడూరు వ్యవసాయ అధికారి సందీప్ అన్నారు. శనివారం రైల్వేకోడూరు మండలంలో ఉన్న ఫెర్టిలైజర్స్ మరియు క్రిమి సంహారక మందుల షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పారాక్వాట్ డైక్లోరైడ్ మందులను ఆంధ్రప్రదేశ్లో తాత్కాలికంగా 60 రోజులపాటు అమ్మకూడదని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న అన్ని ఎరువులు, పురుగు మందుల డీలర్లు తప్పక ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని సూచించారు. ఎవరైనా పైన తెలిపిన మందులను అమ్మితే తప్పక డీలర్లపై చర్యలు ఉంటాయని అన్నారు. అదేవిధంగా రైతును కూడా ఈ నిర్ణయానికి సహకరించి ప్రత్యున్నయ కలుపు నివారణ పద్ధతులను మరియు సిఫారసు చేసిన మందులను మాత్రమే వాడాలని సందీప్ తెలియజేశారు.

## ఎమ్మెల్యే శ్రీధర్‌పై చర్యలు తీసుకోండి : కాంగ్రెస్

**రైల్వేకోడూరు రూరల్, మే 23 ప్రభాతవార్త:**



రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఇటీవల ముస్లిం మహిళలను కించపరుస్తూ మాట్లాడిన మాటలను రైల్వే కోడూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు గోసాల దేవి, శాంతయ్య, డాక్టర్ సయ్యద్ అహమ్మద్లు రైల్వే కోడూరు లోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదమెక్కిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కు గర్వం పెరిగిందని మాటల్లో మర్యాద లేకుండా ముస్లింలను కించపరిచి మాట్లాడటం లో నీతి లేదని అదే విధంగా ముస్లింలు కూడా ఓట్లు వేస్తే ఎమ్మెల్యేగా గెలిచి కులాన్ని కించపరిచి మాట్లాడటం అతనికి అవివేకానికి నిదర్శనమని వారు ఖండించారు. రాష్ట్ర జనసేన అధిపతి పవన్ కళ్యాణ్, అరవ శ్రీధర్ శాసనసభ్యత్వాన్ని రద్దుచేసి పార్టీ నుండి బహిష్కరించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిగమాల రమేష్, కాసల బాలమురళీకృష్ణ, రవి తో పాటు ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

## ఏపీఎండీసీ అవినీతిపై విచారణ చేపట్టండి:కందారపు మురళి

**రైల్వేకోడూరు రూరల్, మే 23 ప్రభాతవార్త :**




రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం మంగంపేట మైనింగ్ శాఖ నందు జరిగిన అవినీతిపై నిప్పు తేల్చాలని ఏపిఎండిసి పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కందారపు మురళి డిమాండ్ చేశారు. శనివారం కోడూరులోని ఎన్జీవో హోం నందు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగంపేట బెరైటీస్ గనుల పరిరక్షణకై ఇచ్చిన చలో ఏపిఎండిసి కార్యక్రమాన్ని జయప్రదం చేసిన ప్రజలందరికీ కృతజ్ఞతలను తెలియజేశారు. మే 20న తమ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు స్పందించి చలో ఏపీఎండిసిని విజయవంతం చేశారని అన్నారు. గనులలో అవినీతి జరిగిందని తాము చెప్పడం లేదని స్వయంగా రాష్ట్రమంత్రి కొల్లు రవీంద్ర అసెంబ్లీ వేదికగా ప్రకటించారని మురళి గుర్తు చేశారు. అవినీతిపై సమగ్ర విచారణ జరిపిస్తామని మంత్రి చేసిన ప్రకటనలను అమలు చేయాలని మాత్రమే తమ కోరుతున్నా మని అన్నారు. ఎంప్రద కంపెనీ గురించి కూడా మంత్రిగారే ప్రస్తావించిన విషయాన్ని కందారపు మురళి గుర్తు చేశారు. బల్క్ టెండర్ విధానాన్ని కొనసాగితే రానున్న రెండేళ్లలోనే మంగంపేట బెరైటీస్ మూతపడటం ఖాయమని అప్పుడు అన్ని వర్గాల ప్రజలకు ఇది నష్టమని మురళి వివరించారు. ఈ కార్యక్రమంలో వందవాసి నాగరాజు, చంద్రశేఖర్, ఆర్ వెంకటేష్, మనీ, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బడి పిలుస్తోంది కార్యక్రమం

**పుత్తూరు రూరల్, మే 23 ప్రభాతవార్త:**



బడిపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శనివారం పుత్తూరు పట్టణం గేటు పుత్తూరు, వీవర్స్ కాలనీ, బాలాజీనగర్‌లలో మండల విద్యాశాఖ అధికారులు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. గేటు పుత్తూరు సీఆర్సీ ప్రధానోపాధ్యాయులు ఆర్.ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో మీపిల్లలను చేర్చాలని తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనాణ్యమైన విద్య క్రమశిక్షణతోకూడిన విద్య అందిస్తున్నారని, ఉపాధ్యాయులు వివిధ రకాలైన ట్రైనింగ్‌లు తీసుకుని విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధిస్తూ ఉన్నారని, విద్యార్థులందరికి బడిప్రారంభం రోజు జూన్ 12 నాటికి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లు పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫాం, బెల్టు, షూలు, నోటు పుస్తకాలు విద్యార్థులకు ఫ్రీగా అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కన్నప్ప, ఉర్దూ టీచరు అత్తర్ యాస్మిన్, తమిళ ప్రధానోపాధ్యాయులు కుమార్, గుండ్ల పుత్తూరు ఉపాధ్యాయులు కృష్ణయ్య, శ్రీనివాసరాజు, సీఆర్ఎంటీ జగ్గారావు పాల్గొన్నారు.

## డాబాలో పార్కింగ్ చేసిన...

### గ్యాస్ ట్యాంకర్‌లో డ్రైవర్ మృతి!

**నాగలాపురం, మే 23 ప్రభాతవార్త:**



నాగలాపురం మండలంలోని కారణి సమీపంలోని ఓ డాబాలో పార్కింగ్ చేసిన గ్యాస్‌ట్యాంకర్‌లో డ్రైవర్ మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా... అనంతపురం నుంచి గుమ్మడిపూడి వైపు వెళుతున్న గ్యాస్ ట్యాంకర్ లారీని డ్రైవర్ శుక్రవారం రాత్రి కారణి వద్ద ఉన్న డాబాలో పార్కింగ్ చేసి వాహనంలోనే నిద్రపోయారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో డ్రైవర్ ఎంత లేపినా స్పందించక పోవడంతో డాబా నిర్వాహకులు నాగలాపురం పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే 108 అంబులెన్స్ సిబ్బందిని పిలిపించారు. అంబులెన్స్ సిబ్బంది పరిశీలించగా డ్రైవర్ మద్యం సేవించలేదని, నిద్రలోనే మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. లారీలో ఉన్న డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా మృతుడు తమిళనాడు రాష్ట్రం నామకల్‌కు చెందిన శరవణన్(53)గా గుర్తించారు. మృతుడి బంధువులకు సమాచారం అందించినట్లు, వారు వచ్చిన అనంతరం మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

## ప్రసన్న వేంకటేశ్వరునికి ఘనంగా ఊంజల్‌సేవ

**వడమాలపేట, మే 23 ప్రభాతవార్త:**



అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామివారికి శనివారం ఊంజల్‌సేవ, గ్రామోత్సవం ఘనంగా జరిగింది. వేకువ జామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఉభయదేవేరులతో పాటు స్వామివారి ఉత్సవ మూర్తులను ఊయాలలో కొలువుదీర్చగా స్వామివారు గంటపాటు సిద్విలాసంగా ఊయలలూగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన స్వామివారు మాడా వీధుల్లో విహరించారు. భక్తులు ధూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, అర్చకులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## కుమారుడి మూర్ఖపు చర్య... కడుపు కోతకు గురైన తల్లి

**-భర్త, కుమార్తె దూరమైనా కొడుకుపై కొండంత ప్రేమ**

**-నడుముకు రాళ్ళు కట్టుకుని బావిలోకి దూకి ఆత్మహత్య**

**తిరుపతి, మే 23 ప్రభాతవార్త:**



మూర్ఖత్వంతో కుమారుడు ఆత్మహత్యకు పాల్పడగా కడుపు కోతకు గురైన తల్లి గుండెలవిసేలా రోధిస్తున్నది. స్థానిక పాతపేట, దిగువ వీధికి చెందిన దివంగత ధనుంజయ రాజు, మునికుమారి దంపతుల కుమారుడు ఆకాష్ (19) నడుముకు రాళ్ళు కట్టుకుని బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన విచారకర దుర్ఘటన శుక్రవారం రాత్రి చంద్రగిరి హైవే సమీపంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి వివరాల మేరకు .. ధనుంజయ రాజు, ఆయన కుమార్తె ఇదివరకే మరణించారు. దీంతో మునికుమారి బ్రతుకు దెరువు కోసం కువైట్‌కు వెళ్ళి వున్న ఒక్కగానొక్క కొడుకును గారాబంగా చూసుకుంటున్నది. గత కొద్ది రోజుల క్రితం ఆకాష్ కోరిక మేరకు తల్లి మొబైల్ ఫోను కొనడానికి దాదాపు లక్షకు పైగా పంపించారు. అయితే ఇప్పుడు మళ్ళీ బైక్ కొనీయమని, చేసిన అప్పులు తీర్చుకోవాలని డబ్బుల కోసం తల్లిని వత్తిడి చేయడంతో ఒకసారి ఇండియాకు వచ్చి మళ్ళీ కువైట్‌కు వెళ్ళి డబ్బులు పంపుతానని తల్లి చెప్పింది. దీనిపై కినుకు వహించిన ఆకాష్ శుక్రవారం రాత్రి హైవేకి సమీపంలోని ఒక బావి వద్దకు చేరుకుని నడుముకు రాళ్ళు కట్టుకుని మరీ బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు తన స్నేహితులకు వాట్సప్ ద్వారా సమాచారాన్ని పంపడంతో పోలీసుల దృష్టికి తీసుకెళ్ళారు. రాత్రి వేళ మృతదేహం లభించకపోవడంతో తిరిగి శనివారం ఉదయం అగ్నిమాపక సిబ్బంది ద్వారా మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి,మృతుడి తాత మునికృష్ణం రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. భర్త మరణం, కుమార్తె మరణం కృంగదీస్తునప్పటికీ ఆ తల్లి వున్న కొడుకునైనా బాగా చదివించుకుని ఉన్నత స్థితికి చేర్చాలని కొండంత ప్రేమతో దేశం కాని దేశానికి వెళ్ళి కష్టపడుతున్న సమయంలో ఈ సంఘటన శరాఘాతంలా ఆమె చెవినపడటంతో హతాశురాలై ఇండియాకు బయలుదేరింది. ఎదిగిన కుమారుడు దూరమైతే ఆ తల్లికి కలిగే గుండెకోతను గుర్తించలేని కుమారుడి మూర్ఖపు చర్య జీర్ణించుకోలేక స్థానికులు సైతం మనోవేదనకు గురవుతున్నారు.

## దళితుల ఇళ్ళ స్థలాలను ధౌర్జన్యంగా కబ్జా

**తిరుపతి, మే 23 ప్రభాతవార్త:**



దళితులకు రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఇంటి స్థలాలను ధౌర్జన్యంగా కబ్జా చేస్తున్నట్లు కొత్త శానంబట్ల దళితవాడుకు చెందిన బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త శానంబట్లకు ఓ వైద్యుడు తమ స్థలాలను కబ్జా చేసి ఫెన్సింగ్ వేస్తున్నట్లు బాధితులు శుక్రవారం విలేకరుల వద్ద వాపోయారు. రెవెన్యూ అధికారులు స్పందించి తమ భూమిని తిరిగి తమకు అప్పగించాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఈ విషయంపై తహశీల్దార్ దుద్దెల అమరేశ్వరిని వివరణ కోరగా ఎవరైతే ఆక్రమణకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారో సదరు వైద్యుడు కోర్టు నుండి శాశ్వత ఇంజెక్షన్ ఆర్డర్ పొందినట్లు తెలిసిందన్నారు. ఈ విషయంలో కోర్టు ఉత్తర్వులను పరిశీలించడంతో పాటు అతని వద్ద ఈ భూమికి సంబంధించి ఎటువంటి డాక్యుమెంట్స్ వున్నాయో పరిశీలించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా బాధితుల వద్ద గల పట్టాలను రెవెన్యూ రికార్డులను క్రాస్ చెక్ చేసుకుని ఎవరికి ఏ మేరకు హక్కులు కలిగివున్నారో పరిశీలిస్తామన్నారు. అర్హులైన వారికి తప్పక న్యాయం చేస్తామని అన్నారు.

# తిరుపతి డివిజన్

## కాలువ భూమి కాపాడాలి...అక్రమాలకు చెక్ పెట్టాలి

**-గాంధీపురంలో స్థానికులు ఆందోళన**

**తిరుపతిరూరల్, మే23 ప్రభాతవార్త:**



తిరుపతిరూరల్ మండలం గాంధీపురం గ్రామ పంచాయతీలో కాలువపోరంబోకు భూమిపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఈరోజు స్థానికులు, మాజీ వార్డు సభ్యులు గళమెత్తారు. ప్రజా ప్రయోజనాల కోసం కేలాయించిన ఈ విలువైన స్థలాన్ని కబ్జా చేయాలనే ప్రయత్నాలను తక్షణమే అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక వైసిపి నేత మన్నూరు శిశ, ఎంపిటిసి సభ్యుడు జైకర్‌లు మాట్లాడుతూ అరకోటి రుపాయాలు విలువ చేసే కాలువ పోరంబోకు స్థలంలో అంగన్‌వాడీ పేరుతో అధికార పార్టీకి చెందిన కొందరు స్థానిక చోట నాయకులు అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఆరోఫించారు. ప్రజా అవసరాల కోసం ఉంచిన భూమిని, స్వార్ధ ప్రయోజనాలకు వినియోగించడం అంగీకారయోగ్యం కాదని వాళ్ళు స్పష్టం చేశారు. ఈ స్థలాన్ని కబ్జా చేయకుండా కాపాడి, గ్రామ అభివృద్ధికి ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ స్థలంలో బడి నిర్మాణం, గుడి లేదా సామాజిక వేదిక, మహిళా భవనం, ఇతర ప్రజా సేవా కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. అక్రమణలు పునరావృతం కాకుండా ఆ స్థలంలో ప్రభుత్వ భూమి అని స్పష్టంగా తెలియజేసే విధంగా అధికారులు అధికారిక హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. కాలువ పోరంబోకు భూమిపై అక్రమ నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజా ఆస్తులను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించకపోతే సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు మాధవి, మేరి,కళావతి, అమ్ములు, మురగారెడ్డి, స్థానికులు మునేయ్య, మణి, గోఫి తదితరులు పాల్గొన్నారు.

## గోపాలరావు కాలనీలో నూతన బోరు బావి ఏర్పాటు

**వరదయ్యపాలెం, మే 23 ప్రభాతవార్త:**



15వ ఆర్థిక సంఘం నిధులతో వరదయ్యపాలెం పంచాయతీ, గోపాలరావు కాలనీలో నూతన బోర్ బావి ఏర్పాటు చేశారు. హరిజనవాడ, గోపాల్ రావు కాలనీలలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ బోర్ వేయడం జరిగిందని పంచాయతీ ఈఓ బసిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇంచార్జి పి. నిర్మల్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ బి. చంద్రబాబు, సురేష్ రెడ్డి, రమేష్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు నూతన బోర్ వెల్ ఏర్పాటు పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## స్వచ్ఛ రథంతో వ్యర్థాలు సేకరణ

**వడమాలపేట, మే 23 ప్రభాతవార్త:**



వడమాలపేట గ్రామంలో అన్ని వీధుల్లో పర్యటించిన స్వచ్ఛ రథం ప్రజల ఇంటి వద్ద నుంచి వ్యర్థాలు సేకరించి, ఆ విలువకు తగిన గృహ సంబంధిత వస్తువులను అందజేశారు. శనివారం వడమాలపేటలో స్వచ్ఛ రథం పర్యటించింది. ప్రజలు ప్లాస్టిక్, ఇనుము, పేపర్లు, అట్టపెట్టెలు వంటి వస్తువులు వేసి వాటి విలువకు సరిపడ అవసరమైన వస్తువులను తీసుకొన్నారు. ప్రజలు ఈ పథకంపై సంతోషం వ్యక్తం చేశారు. ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడుతూ ప్రజలు ఉపయోగంలేని వస్తువులను పారవేయకుండా స్వచ్ఛ రథంలో అందజేసి లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలాజీ, పంచాయతీ కార్యదర్శి విజయభాస్కర్, ఏపీవో హంసవేణి, టీడీపీ ప్రధాన కార్యదర్శి శివరాయల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ సాహితీ మహా సభకు అత్తూరుకు ఆహ్వానం

**పుత్తూరు రూరల్, మే 23 ప్రభాతవార్త:**

జూన్ 6,7 తేదీలల్లో రాజమహేంద్ర వరంలో జరగనున్న ప్రపంచ సాహితీసభలకు అత్తూరు రుద్రి మోహన్‌కు ఆహ్వానం అందడం ఆనందంగా ఉందన్నారు. సాహితీసభలో తాను రచించిన "మాతృధార" కవితా సంకలనం పుస్తకావిష్కరణ జరుగుతుందన్నారు. చిన్న తనం నుంచి కవితలు అల్లడం, కథలు రాయడం అలవాటుగా ఉండడం మూలంగా,సమాజ శ్రేయస్సుతో అల్లిన కవితలకు, కథలకు అనేక రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి బహుమతులు అందడం, ఇలాంటి ప్రపంచ సాహితీ మహాసభలకు గుర్తింపుతో ఆహ్వానం అందడం ఆనందంగా ఉందన్నారు.

## విజయవంతమైన సమ్మర్ క్యాంప్

**పుత్తూరు రూరల్, మే 23 ప్రభాతవార్త:**



పుత్తూరు త్రినేత్ర పిరమిడ్ దివ్యధ్యాన దేవాలయంలో గత 9 రోజులుగా విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌లో అద్భుతంగా ధ్యానం, యోగా, భగవద్గీత, ఇంగ్లీష్ గ్రామర్, హ్యాండ్ రైటింగ్, డ్రాయింగ్, విలువలు చక్కగా నేర్పించడమేగాక, ముగింపు సందర్భంగా అన్నిటిలో కాంపిటీషన్స్ నిర్వహించి పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు ద్వారా బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్న త్రినేత్రకమిటీ సభ్యులను ప్రశంసించారు. ఇంకోసారి జరిగే ఇలాంటి ఈ కార్యక్రమాల్లో ఒక రోజు ఉచితంగా జూపార్కు, సైన్స్ సెంటర్ విజిటింగ్ చేయించే ఏర్పాటుకు తనవంతు పూర్తి సహకారం అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో త్రినేత్ర కమిటీ సభ్యులు సుజాత, పురుషోత్తంశెట్టి, నాగరాజు, సుబ్రహ్మణ్యం, జయచంద్రన్, తిరుమలరాజు, శ్రీనివాసులు, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## నిత్యవసర సరుకులు పంపిణీ

**పులిచెర్ల, మే 23 ప్రభాతవార్త :**



మండలం కల్లూరు గ్రామంలో ప్రమాదానికి గురైన గుర్రంకొండ నూర్ భాషా వారి కుటుంబానికి పులిచెర్ల తాసిల్దార్ వారు విచారించి తనిఖీలు చేసి నివేదికలు పంపి తక్షణ సహాయం చేస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం తక్షణ సహాయ చర్యగా 50 కిలోల బియ్యం కుటుంబ అవసరాలకు సరిపడా సరుకులు, కూరగాయలు వంటి వస్తువులు కార్యాలయ సిబ్బందితో కలిసి అందజేసారు.

ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటును...

## అడ్డుకున్న ఫారెస్ట్ అధికారులు

**- ఆగిన శిలాఫలకం పనులు**



బాలాయపల్లి, మే 23 ప్రభాతవార్త: మండలంలోని మన్నూరు గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ కోసం శిలాఫలకాన్ని అధికారులు ఏర్పాటు చేస్తుండగా అటవీశాఖ సిబ్బంది అడ్డుకున్నారు. ఇండస్ట్రియల్ పార్కు కోసం కేటాయించిన 15 ఎకరాల భూమి అటవీ శాఖకు చెందిందని బీట్ అధికారిని భవాని సిబ్బంది పనులు చేయకుండా అడ్డగించారు. మండల సర్వే పూజిత, బీట్ ఆఫీసర్ భవానిలో మినీ ఇండస్ట్రియల్ పార్క్ కోసం ఏర్పాటుచేసిన స్థలం రికార్డులను పరిశీలించారు. అటవీశాఖ భూమిలో పార్కు ఏర్పాటు చేయరాదని అటవీ శాఖ సిబ్బంది రెవెన్యూ అధికారులను అడ్డగించారు. కాగా ఇండస్ట్రియల్ పార్క్ ప్రారంభించేందుకు ఏర్పాటు చేయాలనుకున్న శిలాఫలకం పనులను ఆపివేశారు. ఇండస్ట్రియల్ పార్క్ కోసం కేటాయించిన స్థలం అటవీశాఖకు చెందిందని ఆ శాఖ అధికారులు ఇక్కడ ఏర్పాటు చేయరాదని నిలిపివేశారు. జాయింట్ సర్వే పూర్తయిన తర్వాత స్థలం అటవీశాఖ లేక రెవెన్యూ వారిద స్పష్టత రానుంది. స్థల వివాదంతో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు బ్రేక్ పడింది.

## కెనరా బ్యాంక్ సౌజన్యంతో ఆర్థిక భరోసా



తడ, మే 23 ప్రభాతవార్త : తడ మండలం భీములవారిపాలెం గ్రామానికి చెందిన రాజాఅనారోగ్య సమస్యతో మృతి చెందాడు కెనరా బ్యాంక్ నందు ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన (పిఎంజెజెబివై) యాక్టివ్‌లో ఉంది. దీనికిగాను సూళ్లూరుపేట ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్స్ బ్యాంకులో క్లెయిమ్ చేశారు. పీఎంజెజెబివై ద్వారా రూ.2 లక్షలు రూపాయలు అమోంట్ సెటిల్మెంట్ అయ్యింది. ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన(పిఎంజెజెబివై) ద్వారా రూ. 2 లక్షల రూపాయలు మృతుడు రాజా భార్య తిరుమదకి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ యువరాజ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన మరియు ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన అందరూ నమోదు చేసుకోవాలని భవిష్యత్తులో జరిగే అకాల సంఘటనలకు మీ కుటుంబాలకి చేయూత కలిగే విధంగా భరోసా కల్పిస్తుంది తెలియజేశారు ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ యువరాజ్, బ్యాంక్ సిబ్బంది వెంకటేశ్, పవిత్ర వెలుగు ఏపిఎం రాజా రెడ్డి, సీసీ జనార్దన్ మరియు సూళ్లూరుపేట ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్స్ ముని చంద్ర, పరమానందం పాల్గొనడం జగిరింది.

## సూళ్లూరుపేటలో ఆపరేషన్ క్లీన్ స్వీప్



సూళ్లూరుపేట, మే 23 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్త సుదీర్ఘ పారిశుద్ధ్య అవగాహన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా,పట్టణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని బజారు వీధిలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కే చిన్నయ్య మున్సిపల్ అధికారులు సిబ్బంది చీపురు చేతబూని బజారు వీరిలోనిరోడ్లను శుభ్రం చేశారు. ప్రజలు స్వచ్ఛందంగా చెత్తను రోడ్లపై ,డ్రైనేజీలపైలేకుండా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలని కమిషనర్ కోరారు. స్వచ్ఛ సూళ్లూరుపేటను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామికి విశేష పూజలు



వాకాడు, మే 23 ప్రభాతవార్త: వాకాడు మండలం కల్లూరు కొత్తపాలెం గ్రామంలో నూతనంగా ప్రతిష్టించిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీ వెంకటేశ్వర స్వామికి ఆలయ అర్చకులు పవన్ కుమార్ విశేష పూజలు అభిషేకాలు ఆలయ ధర్మకర్త దువ్వూరు జనార్దన్ రెడ్డి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆలయం విగ్రహ ప్రతిష్ట అనంతరం రెండవ శనివారం కావడంతో తన గృహం నుండి గుడి వరకు పాదయాత్ర చేపట్టడం జరిగిందన్నారు, ఈ విధంగా మరో 5 శనివారాలు వరకు దీక్ష కాలినడకన రావడం ఉందన్నారు. ఆలయంలోని శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక, విశేష పూజలు అనేకమంది స్వామిని దర్శించుకొన్న వారికీ ఆలయ అర్చకులు పవన్ కుమార్ పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలోని నిత్య అన్నదానం కార్యక్రమం జరుగుచున్నది. అన్నదాన కార్యక్రమంను ప్రముఖ ఆక్వారైతు ఏ అశోక్ నిర్వహించగా వెంకటేశ్వర స్వామికి విశేష పూజా అశోక్ దంపతులు అనంతరం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తులుకు ఆలయ ధర్మకర్త దువ్వూరు జనార్దన్ రెడ్డి తీర్థప్రసాదాలు అందించారు.

## కూటమితోనే అభివృద్ధి విప్లవం మొదలైంది : ఎమ్మెల్యే




పెళ్లకూరు, మే 23 ప్రభాతవార్త: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అభివృద్ధికి దూరంగా ఉన్నారని కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి సుమారు రెండు సంవత్సరాల కాలంలోనే అన్ని శాఖలలో గల అవనీతిని అంతమొందిస్తూ అభివృద్ధివైపు రాష్ట్రం పరుగులు పెడుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గం శాసన సభ్యురాలు నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం పెళ్లకూరు మండలంలోని ఎంపీడీవో కార్యాలయం నందు ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పరిపాలన మరిచి అవినీతి సంపాదన పై మనసు పెట్టారని నియోజకవర్గంలో ఎక్కడ కూడా రోడ్లపై ఏర్పడిన గుంతల్లో తట్టెడు మట్టేసిన పాపాన పోలేదని అలాగే పంట కాలవలు పూడికతీతను పూర్తిగా గాలికి వదిలేసిందని గత వైసిపి ప్రభుత్వం పై విరుసుకు పడ్డారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో సుమారు 40 వినతలు స్వీకరించగా వచ్చిన ఈ అర్జీలను ఆయా శాఖలకు సంబంధించిన అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే విజయ శ్రీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయశ్రీ తో పాటు నియోజకవర్గ ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, మండల అధికారులు ఎంపీడీవో ప్రమీల రాణి, ఎంఆర్ఓ హరికృష్ణ మరియు అన్ని శాఖలకు సంబంధించిన అధికారులుతో పాటు కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు ప్రజలు విరివిగా పాల్గొన్నారు.

## పోర్టును గ్రామం దూరంగా పెట్టాలని తహసిల్దార్‌కు వినతి పత్రం



వాకాడు, మే 23 ప్రభాతవార్త: నౌక కేంద్రం పోర్టును తూపిలి పాలెం గ్రామం దూరంగా పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, పెద్దకాపు ఆర్కోటి మహేంద్ర, నడిమి కాపు పాముంజి గోవిందయ, చిన్న కాపు వావిల గోవిందయ్య మరియు మత్స్యకారులు కలిసి శనివారం మండల తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తహసిల్దార్ తో మాట్లాడుతూ గ్రామం వరకు పోర్టు వస్తే స్మశానం, త్రాగునీటి బోర్లు, వివిధ రకాల జంతువులు కు నివాస స్థలములు వసతి సౌకర్యాలు గ్రామం కోల్పోతుందని తహసిల్దార్ పరిశీలించి సర్వే నంబర్ 70 వరకు గ్రామ అభివృద్ధికి వెసులుబాటు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు, తూపిలి పాలెం గ్రామంలో ఉన్న 3500 జనాభా గల గ్రామమని పోర్టు వల్ల అన్ని సౌకర్యాలు, మౌలిక వసతులు సదుపాయాలు కోల్పోవడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తాసిల్దార్ కు తెలియజేశారు, గ్రామం కు వెసులుబాటు కల్పించకపోతే అనేక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి కలుగుతుందని ముందస్తుగా తెలియజేస్తున్నామని తెలిపారు. తాసిల్దార్ స్పందించి ఆర్డీవో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు, స్థానిక నేతలు, ప్రజలు తదితరులు ఉన్నారు.

# పనితీరు మార్చుకో!

**- పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌కు, సిఎం చంద్రబాబునాయుడు క్లాస్**



పార్టీ కార్యకర్తలతో సమావేశమైన సిఎం

యాదమరి, మే 23 ప్రభాతవార్త: ప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షణలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ 13 అంశాల్లో వెనుకబడి వుండటంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆయనను పనితీరు మార్చుకోవాలని సూచించారు. యామదరి మండలం 14 కండ్రిగ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన 39వ కార్యకర్తల సమావేశంలో సిఎం చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన సిఎం నారా చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సిఎం ఎమ్మెల్యే మురళీ మోహన్‌తో మాట్లాడుతూ బూత్, గ్రామ కమిటీల్లో నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. గ్రామ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని, రానున్న ఎన్నికలకు క్షేత్ర స్థాయిలో సర్వశక్తులు ఒడ్డాలని, ఎన్నికల్లో వందకు వెయ్యి శాతం విజయం సాధించేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయాలని స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి పార్టీ కార్యకర్తలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయడానికి కృషి చేయాలని, పార్టీలో ప్రతి కార్యకర్త కష్టపడి పని చేస్తే అందరికి పదవులు లభిస్తాయన్నారు. ఈ సమావేశం అనంతరం సిఎం నారా చంద్రబాబునాయుడు ప్రతి కార్యకర్తతో ఫోటో తీయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, జిల్లా పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి, సునీల్ చౌదరిలు, మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొరార్జీ, వెంకటేష్ రబ్బీలు, అనుబంధ కమిటీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## మెగా కౌన్సిలింగ్‌కు తరలిన రౌడీషీటర్లు




సూళ్లూరుపేట, మే 23 ప్రభాతవార్త: సమాజంలో మార్పు తీసుకురావడమే ధ్యేయంగా తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆధ్వర్యంలో శనివారం తిరుపతి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి మెగా కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడుపేట సబ్ డివిజన్ నుండి 70 మంది హాజరుకాగా, అందులో సూళ్ళూరుపేట సర్కిల్ పరిధి ప్రత్యేకంగా నిలిచింది. స్థానిక సీఐ ఎం. మురళీకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని, తమ సర్కిల్ పరిధిలోని 30 మంది రౌడీ షీటర్లు, గంజాయి ముద్దాయిలు, పోక్సో మరియు దొంగతనం కేసుల షీటర్లను తిరుపతికి తరలించేందుకు ప్రత్యేకంగా ఒక బస్సును ఏర్పాటు చేశారు. సీఐ ఎం.మురళీకృష్ణ పర్యవేక్షణలో సూళ్ళూరుపేట ఎస్సైలు గంటా అజయ్ కుమార్, సుబ్రహ్మణ్యం రాజు, తడ ఎస్సై కొండప్పనాయుడు పోలీస్ సిబ్బంది స్వయంగా ఆ బస్సులో ఈ 30 మందిని తిరుపతి పోలీస్ గ్రౌండ్స్‌కు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు మాట్లాడుతూ జిల్లాలో రౌడీయిజం, గంజాయి రవాణా, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. అనంతరం పోలీసులు యువతకు హితవు పలుకుతూ క్షణికావేశంలో తప్పుడు మార్గాల్లోకి వెళ్లి మీ బంగారు భవిష్యత్తును జైలు పాలు చేసుకోవద్దు, మీ వెనుక మిమ్మల్ని నమ్ముకున్న కుటుంబాలు ఉన్నాయి, మన సూళ్ళూరుపేట, తడ పరిసర ప్రాంతాలలో ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు ఉన్నాయి. చెడు సావాసాలు వీడి ఆయా పరిశ్రమల్లో గౌరవప్రదమైన ఉద్యోగాలు లేదా ఉపాధి అవకాశాలు పొంది, కుటుంబాలకు ఆసరాగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూళ్ళూరుపేట, తడ పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

## మోటర్ బైక్‌ల దొంగ అరెస్ట్- ఐదు బైకులు స్వాధీనం



సూళ్లూరుపేట, మే 23 ప్రభాతవార్త : సూళ్లూరుపేట, తడ, తిరుపతి ప్రాంతాలలో వివిధ బైకు చోరీ కేసులతో సంబంధం ఉన్న నెల్లూరుకు చెందినతంజావూరు గణేష్ కుమార్‌ను శనివారం సూళ్లూరుపేట పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి 5 లక్షల రూపాయల విలువ గల ఐదు మోటర్ బైక్ లను స్వాధీనం చేసుకున్నారు.సిఐ ఎం మురళీకృష్ణ కథనం మేరకువివరాలు ఇలా ఉన్నాయి. శనివారం సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారు పోలూరు, మామిడి రేవుల వద్ద అనవసర మోటర్ బైక్‌తో సంచరిస్తున్న గణేష్ కుమార్ ను ఎస్ఐ అజయ్ కుమార్ పట్టుకొని అరెస్ట్ చేశారు అన్నారు. గణేష్ కుమార్ గతంలో నెల్లూరులో ఓ చోరీ కేసు కు సంబంధించి జైలు శిక్ష అనుభవించి ఉన్నాడని సీఐ తెలిపారు. సూళ్లూరుపేట లోరెండు బైకులు, తడలో ఒక బైకు తిరుపతిలో రెండు బైకులను చోరీ చేసినట్లు గణేష్ కుమార్ అంగీకరించినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు పర్యవేక్షణలో మోటర్ బైక్ దొంగను పట్టుకున్న ఎస్ఐ అజయ్ కుమార్ నుహెడ్ కానిస్టేబుల్ కుమారస్వామి, వెంకట బాబులను సిఐ అభినందించి రివార్డు కొరకు ఉన్నత అధికారులకు ప్రతిపాదనలను పంపినట్లు సీఐ మురళీకృష్ణ చెప్పారు.

## తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతల స్వీకారం

**- సమిష్టిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం**



సూళ్లూరుపేట, మే 23 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇప్పటి వరకు ఈసెక్షన్ సూపరిండెంట్‌గా అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహించిన సీనియర్ అధికారి జి. చంద్రశేఖర్ రెడ్డి నాయుడుపేట నూతన తహసీల్దార్‌గా ఎఫ్ఏసి అదనపు బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలను స్వీకరించిన అనంతరం, నియోజకవర్గ, మండల స్థాయి గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం మరియు రెవిన్యూ జేఏసీ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసు కున్నారు. నాయుడుపేట ఇన్చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జి.చంద్రశేఖర్‌రెడ్డికి రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టరేట్‌లో సుదీర్ఘ పరిపాలనా అనుభవం ఉన్న చంద్రశేఖర్ రెడ్డి నాయుడుపేటకు రావడం పట్ల రెవెన్యూ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టేటి మనోజ్ కుమార్, ఏపీజేఏ నాయకులు భూధనం రమేష్, నాయుడుపేట మండల అధ్యక్షులు పద్మనాభ రెడ్డి ప్రత్యేకంగా పాల్గొని నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు మండల జేఏసీ ముఖ్య సభ్యులు సట్టి పోలయ్య, రాజా, చందు, నాగార్జున, భాగ్యలక్ష్మి, శ్రీనివాసులు, గోవర్ధన్, మండల పరిధిలోని గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, విఆర్ఏలు కార్యాలయ సిబ్బంది పాల్గొని నూతన తహసీల్దార్‌కి సాదర స్వాగతం పలికారు.

## విప్ పదవికి రాజీనామా చేసిన ఎమ్మెల్యే శ్రీధర్

రైల్వేకోడూరు రూరల్, మే 23 ప్రభాతవార్త : రైల్వే కోడూరు జనసేన పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ శాసనసభ విప్ పదవికి రాజీనామా చేశారు. సచివాలయంలో డిప్యూటీ సీఎం జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తో భేటీ అనంతరం రాజీనామా ప్రకటన చేశారు. వ్యక్తిగత కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. తనపై వచ్చిన ఆరోపణలు, నెలకొన్న వివాదాలపై కూడా శ్రీధర్ వివరణ ఇచ్చారు

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి....మరొకరికి తీవ్ర గాయాలు

పుత్తూరు(నారాయణవనం), మే 23 ప్రభాతవార్త : మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరొక యువకుడు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్ఐ గిరిబాబు కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మండలంలోని గోవిందప్ప నాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన మునికృష్ణయ్య కుమారుడు ఉదయ్‌కుమార్ (19) స్నేహితులు ఎస్.యువరాజ్ (17), కె.యువరాజ్ (18)లతో కలిసి తన ద్విచక్ర వాహనంపై మండలంలోని సింగిరికోనకు వెళ్లారు. తిరిగి వచ్చేటపుడు నారాయణవనం నుంచి పాత సర్వీసు రోడ్డు మీదుగా తమ గ్రామానికి మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో బయలుదేరారు. సరిగ్గా బొప్పరాజుపాలెం బస్‌స్టాప్ వద్ద హైవే మీదకు వచ్చేసరికి పుత్తూరు నుంచి నాగలాపురం వెళుతున్న ఒక కారు మోటారుసైకిల్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో ద్విచక్రవాహనంపై నుంచి ముగ్గురూ ఎగిరి కిందపడిపోయారు. అదే సమయంలో తిరుపతి వైపుగా మరో కారు కింద పడిన ఇద్దరు యువరాజులను ఢీకొంది. దాంతో ఇద్దరు అక్కడకక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన ఉదయ్‌కుమార్‌ను ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా వుండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు పంపంచారు. ఇద్దరు మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన



తిరుపతి,మే 23ప్రభాతవార్త: పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరం శనివారం తెల్లవారుజామున భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. భజన మండలి సభ్యులు శనివారం చేపట్టిన భజనలతో నగర సంకీర్తన భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గోవింద నామస్మరణల మధ్య మేళతాళాలు, మంగళ వాయిద్యాల నాదంతో నగర సంకీర్తన ఘనంగా ప్రారంభమైంది. సంకీర్తన అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ముగించారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు మునెప్ప గారి మునినాథరెడ్డి, భాస్కరాచారి, జ్యోతి, వాసుదేవ రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు విజయభాస్కర్ రెడ్డి, అన్నూరు మునిరత్నమాచారి, పురుషోత్తమ యాదవ్, రాజేంద్రన్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, మిట్టపల్లి బ్రహ్మానందం, వెంకటాద్రి, తిరుపాల చారి, అరుణమ్మ, జయమ్మ, విజయ కుమారి, అమరావతి, రేవతి, ఉమా జి, పద్మ, వై.పద్మావతి, సిద్ధమ్మ, ధనమ్మ, శ్రావణి, నాగరాజామ్మ, పద్మావతి, కళ్యాణి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆంకాలజీ భవనాలను పరిశీలించిన తితిదే జేఈఓ



తిరుపతి హెల్త్, మే 23 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) నందు నిర్మితమోతున్న శ్రీ బాలాజీ ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ నూతన భవనాలను శనివారం తిరుపతి దేవస్థానాల జె.ఈ.వో ఎ.శరత్, పాలక మండలి సభ్యులు మరియు స్విమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు ఎన్. సదాశివరావు, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ నిర్మితమోతున్న భవనాన్ని పరిశీలన చేశారు. తితిదే జేఈవో డా. శరత్ స్విమ్స్ లో నిర్మితమోతున్న శ్రీ బాలాజి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. టిటిడి, ఎపిఎంఎస్ఐడిసి ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, పేషంట్ల సౌకర్యార్థం అతి త్వరలో ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. శ్రీ బాలాజి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజి భవనాన్ని అన్ని విభాగాల క్యాన్సర్ పేషంట్లకు అందుబాటులోకి త్వరలో తీసుకొస్తున్నట్లు తెలిపారు. పాలకమండలి సభ్యులు, స్విమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు ఎన్.సదాశివరావు ప్రతిష్టాత్మకంగా నిర్మితమోతున్న శ్రీ బాలాజి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజి భవనం నందు స్విమ్స్‌లో అందుబాటులో వున్న అన్ని రకాల క్యాన్సర్ విభాగాలని ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి, ఆత్యాధునిక వైద్య పరికారాలను, వైద్య నిపుణులతో ఈ భవనాన్ని అతి త్వరలో ప్రారంభించనుట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఇఓతో పాటు స్విమ్స్ డైరెక్టర్ డా. ఆర్.వి.కుమార్, రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి డా సుబ్రమణియన్, ఆర్.ఎం.ఓ. డా. సతీష్, టిటిడి, ఎపి ఎంఎస్ఐడిసి ఇంజనీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం : ఎమ్మెల్యే ఆరణి




తిరుపతి విద్య, మే 23 ప్రభాతవార్త: తిరుపతి నగరంలోని ఎస్వీ క్యాంపస్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహి ంచిన బడి పిలుస్తుంది కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరచడం అభినందనీయమని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర, దొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, తల్లికి వందనం, వంద రోజుల విద్యా ప్రణాళిక వంటి కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు. అలాగే పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా నియామకాలు చేపట్టడం వల్ల విద్యార్థులకు మెరుగైన విద్య అందుతోందని పేర్కొన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అర్బన్ మండల పరిధిలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే అతిథులు సన్మానించారు. అనంతరం బాలాజీ కాలనీలో మానవహారం నిర్వహించి, భారీ ర్యాలీతో ఎన్టీఆర్ విగ్రహం వరకు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు బాలాజీ,, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓం శక్తి ఆలయంలో చిత్ర పౌర్ణమి పూజలు



పుత్తూరు (నగరి), మే 23 ప్రభాతవార్త : చిత్ర పౌర్ణమి సందర్భంగా నగరి మునిసిపాలిటీలో వున్న ఓం శక్తి ఆలయంలో శనివారం విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. 108 మంది మహిళా భక్తులు ఎరుపు రంగు వస్త్రాలు ధరించి అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. 1008 కుంకుమార్చన, 1008 పుష్పార్చన కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. పూజల అనంతరం మహిళా భక్తులకు జాకెట్ వస్త్రం, అర్చన వస్తువులు, పసుపు, కుంకుమ, లడ్డు ప్రమాదం పంపిణీ చేశారు. మహిళా భక్తులతో పాటు ప్రత్యేక పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు భక్తులకు కుంకుమ ప్రసాదాలు, ఆలయ సేవకులకు వస్త్ర దానం చేశారు.

## 4 ఏళ్ల చిన్నారిపై లైంగిక దాడి!

**పోక్సో చట్టం కింద కేసు నమోదు**



విజయపురం, మే 23 ప్రభాతవార్త : నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి చేసిన నాగరాజు అనే వ్యక్తిపై (52) పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వన్నాయి. మండలంలోని గొల్లకండ్రిగ దళితవాడకు చెందిన నాగరాజు అదే గ్రామంలోని నాలుగేళ్ల చిన్నారికి మామిడి పండు ఇచ్చి ఇంటికి తీసుకెళ్లి తలుపు వేసుకుని బట్టలు విప్పడానికి ప్రయత్నం చేస్తుండడంతో పాప గట్టిగా కేకలు వేసింది. పాప ఏడుపును పసిగట్టిన తల్లి వెళ్లి తలుపు తీసి చూడగా నాగరాజు చేస్తున్న వికృత చేష్టలు బయటపడ్డాయి. దాంతో అతనికి దేహశుద్ధి చేయడంతో పరారయ్యాడు. బాధితులు విజయపురం ఎస్ఐ వెంకటసుబ్బయ్యకు ఫిర్యాదు చేయడంతో పరారీలో వున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## శివయ్య సేవలో కర్నాటక మాజీ సిఎం పూజలు

శ్రీకాళహస్తి మే 23 ప్రభాతవార్త:




దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి వాయులింగేశ్వరుని పుణ్యక్షేత్రానికి కర్ణాటక రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు బి.ఎస్ యద్యూరప్పకు, బిజెపి షిమోగా పార్లమెంట్ సభ్యుడు బి.వై.రాఘవేంద్రలు కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు.ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా వవెంటనే ఆలయాధికారులు సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద ఏర్పాట్లు చేసారు. ప్రత్యేక రాహుకేతుదోష నివారణ పూజల, తరువాత వారికి ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్ పెక్టర్ సుదర్శనం నాయుడు పర్యవేక్షించారు.

### బిజెపి సారధ్యంలో స్వాగతం:

కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యద్యూరప్ప, షిమోగా ఎంపి రాఘవేంద్రలు కుటుంబ సభ్యులతో రాగా ఆలయ అతిథి గృహం వద్ద బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ సారధ్యంలో బిజెపి సభ్యులు ఆత్మీయస్వాగతం పలికారు. ఆలయం నందు వారు రాహు కేతు ప్రత్యేక పూజలో పాల్గొని, శ్రీకాళహస్తీశ్వర స్వామిఅమ్మవార్ల దర్శనం చేసుకొని వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు,ఆలయ అధికారులు భారతీయ జనతా పార్టీ నాయకులు వారికి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక,తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితులు చాగణం శైలజ, వెంకట రమణ నాయుడు, సీనియర్ సభ్యులు కంద్రిగ ఉమా, గరికపాటి రమేష్ బాబు, మండల అధ్యక్షులు హరీష్ రెడ్డి, భగీర్తి వెంకటేష్, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్ష రాలు ఉమా సింగ్, యువ మోర్చా అధ్యక్షులు భరత్ నాయుడు, హరితదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పథకాన్ని కొనసాగించాలి

కేవీబీ పురం, మే 23 ప్రభాతవార్త:




మహాత్మగాంధీ పేరుతో ఉన్న పాత గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మహాత్మగాంధీ పేరుతో ఉన్న గ్రామీణ ఉపాధిహామీ పథకం చట్టం పరిధిలో ఉందని కొత్తగా వచ్చిన వీబీ గ్రామ్ జీ పథకం కేవలం కేంద్ర ప్రభుత్వ ప్రయోజత పథకంగా ఉందని కేంద్ర ప్రభుత్వం యొక్క దయాదాక్షిన్యాలపై నిధులు విడుదల చేసే అవకాశం ఉన్నందున ఈ పథకం మా కొద్దని నిరసన తెలియజేశారు. పాత పథకంలో 90 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం గ్రాంట్‌గా మంజూరు చేస్తుండేదని, కొత్త పథకంలో కేవలం 60 శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చి మిగిలిన 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సి ఉందని తెలిపారు. ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం నిధులు ఇవ్వలేక ఈ సంవత్సరం గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని నిర్వహించలేమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు. ఇలాంటి పరిస్థితులు దాపురిస్తాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చిందన్నారు. కాబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచన చేసి మహాత్మగాంధీ పేరుతో ఉన్న గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని కొనసాగిస్తూ సంవత్సరానికి 200 రోజులు పని కల్పించి రోజుకు 700 రూపాయలు వేతనం మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం ఎంపీడీవోకి, రంగయ్యగుంట సచివాలయ కార్యదర్శికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వరలక్ష్మి, సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు, సంఘ సభ్యులు కమలమ్మ, జానకి, అధ్యక్షులు శంకరయ్య, మునస్వామి, సక్కమ్మ, మనీ, కన్నమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకి ఘన స్వాగతం పలికిన షణ్ముగంరెడ్డి

పుత్తూరు రూరల్, మే 23 ప్రభాతవార్త:



చిత్తూరు పార్లమెంట్ పరిధిలోని పూతలపట్టు నియోజకవర్గంయాదమరి మండలంలో సంజీవని పథకాన్ని ప్రారంభించడానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకి చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చెక్కుడు కుప్పం షణ్ముగంరెడ్డి ఘన స్వాగతం పలికారు. ఆయనతో నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

## అజయ్ కుమార్ నోరు అదుపులో పెట్టుకో!

– తెలుగుదేశం పార్టీ నాయకులు

తిరుపతి హెల్త్, మే 23 ప్రభాతవార్త:

టిడిపి వాళ్ళు భూకబ్జాదారులు అంటున్న అజయ్ కుమార్‌కు సూటిగా ప్రశ్నిస్తున్నామన్నారు. అజయ్ కుమార్ నీలాగా అంబేద్కర్ విగ్రహం పెట్టి పక్కనే ప్రభుత్వ భూమిని బోర్డు పెట్టిన కానీ గత వైసిపి గవర్నమెంట్‌లో ఆ స్థలమును ఆక్రమించుకుని ఒక కాంప్లెక్స్‌ని ఏర్పాటు చేసుకుని అందులో బాడుగులు తీసుకుని బతుకుతున్న బతుకు మా నాయకుడిది కాదు, మీ జోలికి మేము రాలేదు అంటే మేము చేతగాని వాళ్ళం కాదు అని నీవు అనుకుంటున్నావు అని తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గిరి శ్రీనివాసులు, బాలాజీ, యశోదమ్మలు ఆర్. అజయ్ కుమార్‌పైన తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా నాయకులు షాప్ చైర్మన్ రవి నాయుడుని జేబీ శ్రీనివాసులు విమర్శించే అర్హత నీకు లేదని నీలాగా మద్యం మత్తులో మాట్లాడే సంస్కృతి మా నాయకులది కాదని తెలియజేస్తున్నామన్నారు.

## కేవీబీ పురం మండలంలో కూరపాటి పర్యటన

కేవీబీ పురం, మే 23 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలంలోని కల్లూరు పంచాయతీ కాళంగి గ్రామంలో జరిగే పలు కార్యక్రమాల్లో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కూరపాటి శంకర్‌రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు మునస్వామియాదవ్ తదితరులు పాల్గొంటారని టీడీపీ నాయకుడు మాధవరెడ్డి పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం మండలంలోని శ్రీనివాసపురం(మారప్పరెడ్డి కండ్రిగ) గ్రామంలో అత్యంత వైభవంగా జరిగే ద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల అగ్ని తిరుణాళ్ళకు పాల్గొంటారని తెలిపారు. వారితో పాటు నాయకులు, కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## యస్వీయూలో కార్యశాల పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి విద్య, మే 23 ప్రభాతవార్త :



ఎస్వీయూ లోని వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జూన్ 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యశాల పోస్టర్‌ను విశ్వవిద్యాలయ ఉపకులపతి టాటా నరసింగ రావు, రెక్టర్ అప్పా రావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, వృక్షశాస్త్ర విభాగ ఆచార్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహజ వ్యవసాయ విధానాలపై రైతులు, విద్యార్థులు, పరిశోధకుల్లో అవగాహన పెంపొందిం చేందుకు ఈ కార్యశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుభాష్ పాలేకర్ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, నేల సారవంతత పరిరక్షణ, రసాయన రహిత సాగు విధానాలపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఐదు రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాలపై నిపుణులు ఉపన్యాసాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పరిశోధకులు, విద్యార్థులు, యువ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆధునిక మరియు ప్రకృతి అనుకూల సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మలబార్‌లో ప్రత్యేకంగా తన్విక ఆభరణాల ఆవిష్కరణ

తిరుపతి విద్య, మే 23 ప్రభాతవార్త :




తిరుపతిలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రత్యేక బంగారు ఆభరణాల కలెక్షన్ తన్విక ను ఆవిష్కరించింది. భారతీయ సంప్రదాయం, దేవాలయాల కళాత్మకత, ఆధునిక ఆభరణాల నైపుణ్యాన్ని సమన్వయం చేస్తూ రూపొందించిన ఈ ప్రత్యేక కలెక్షన్ ఏప్రిల్ 3 నుంచి జూలై 12 వరకు ప్రదర్శనలో ఉండనుంది.తిరుపతిలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రదర్శన మందిరంలో నిర్వహించిన కార్యక్రమాన్ని వినియోగదారుల చేత ప్రారంభించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో షో రూమ్ హెడ్ రిజేష్, వినియోగదారులు, శ్రేయోభిలాషులు, ఆహ్వానితులు పాల్గొన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా సంస్థ తమ లాభాల్లో ఐదు శాతాన్ని విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు కేటాయిస్తున్నట్లు వెల్లడించింది.

## శ్రీవిష్ణుభట్టాచార్యులకు ఆగమ విద్యా రత్న పురస్కారం

తిరుపతి విద్య, మే 23 ప్రభాతవార్త :



తిరుపతికి చెందిన ప్రముఖ ఆగమ పండితుడు వేదాంతం శ్రీ విష్ణు భట్టాచార్యులు కు నవజీవన్ సంస్థ ఆగమ విద్యా రత్న పురస్కారాన్ని ప్రదానం చేసింది. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో మూడు దశాబ్దాలుగా ఆగమ విభాగంలో సేవలందిస్తూ విభాగాధిపతిగా, దర్శన సంకాయ డీన్‌గా, సీనియర్ ఆచార్యులుగా కొనసాగు తున్న ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కే. శ్రీధరాచార్యులు తెలిపారు.ప్రతి సంవత్సరం విశిష్ట పండితులను సత్కరించే కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది శ్రీవిష్ణుభట్టాచార్యులను సన్మానించినట్లు పేర్కొన్నారు. వైఖానస ఆగమం, జ్యోతిష్యం, వేదాంత విజ్ఞాన శాస్త్రం ఆయనకు విశేష పాండిత్యం ఉందన్నారు.తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ఆలయాల ఆగమ సలహాదారుగా, అర్చక శిక్షణ కన్వీనర్‌గా, పంచాంగ పరిష్కర్తగా ఆయన విశేష సేవలు అందించినట్లు తెలిపారు. 30కు పైగా గ్రంథాలు, 40కు పైగా వ్యాసాలు రచించిన ఆయన 20 మంది పరిశోధన విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు.ఇప్పటికే పలు ఆధ్యాత్మిక, శాస్త్రీయ సంస్థల నుంచి అనేక బిరుదులు, సత్కారాలు అందుకున్న శ్రీవిష్ణుభట్టాచార్యులను నవజీవన్ సంస్థ పురస్కారంతో సత్కరించడంపై పలువురు పండితులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

## గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు కౌన్సిలింగ్

తిరుపతి విద్య, మే 23 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాల భర్తీకి భౌతిక కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయ అధికారి టి. పద్మజ తెలిపారు.ఐదో తరగతి బాలురు, బాలికల ప్రవేశాలకు ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. అలాగే ఇంటర్మీడియట్ సాధారణ, ఐఐటీ, నీట్ విభాగాల ప్రవేశాలకు ఈ నెల 30న ఉదయం 10 గంటల నుంచి కౌన్సిలింగ్ జరగనుంది. ఈ కార్యక్రమం పుదూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించబడుతుంది.ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు మాత్రమే కౌన్సిలింగ్‌కు అర్హులని తెలిపారు. ఇప్పటికే మొదటి, రెండో జాబితాల్లో సీట్లు ఖరారైన విద్యార్థులు హాజరు కావాల్సిన అవసరం లేదన్నారు. ఎంపిక కాలేని విద్యార్థులు, కేటాయించిన పాఠశాలలో చేరేందుకు ఆసక్తి లేని వారు, మార్పు అవకాశాన్ని కోరిన విద్యార్థులు కౌన్సిలింగ్‌లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపిక ప్రతిభ, రిజర్వేషన్లు, ఖాళీల లభ్యత ఆధారంగా జరుగుతుందని తెలిపారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ప్రతిభ పత్రం, ప్రవేశ పత్రం, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు తదితర ధృవపత్రాలు వెంట తీసుకురావాలని సూచించారు.

## శివయ్య సేవలో మాజీ మంత్రి

శ్రీకాళహస్తి,మే 23 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం మాజీ మంత్రి దేవినేని ఉమ దంపతులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ప్రొటోకాల్ ఎఇఓ మోహన్ సారధ్యంలో వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆ నందకుమార్, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి స్వాగతం పలికారు.

## ఆర్‌టిసిలో వైద్యశిబిరం

శ్రీకాళహస్తి,మే 23 ప్రభాతవార్త




శ్రీకాళహస్తి ఎపియస్‌ఆర్‌టిసి డిపో ఆవరణలో శనివారం ఏరియా ఆసుపత్రి డాక్టర్లచే ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రికి చెందిన డాక్టర్ బాలు సారధ్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆర్‌టిసి డిపో సిబ్బందికి ప్రయాణీకులకు వివిధ రకాల వైద్యపరీక్షలను నిర్వహించారు. ముఖ్యంగా షుగర్,బిపి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేసారు.ఈ కార్యక్రమాలను ఆర్‌టిసి డిపోమేనేజర్ రేవతి పర్యవేక్షణలో నిర్వహించగా వైద్యపరీక్షలను ఎన్ఎం కాంచన, ఆశావర్కర్ జానకి,శంకుతల లు పర్యవేక్షించారు.

## మారుతున్న జీవన విధానానికి అనుగుణంగా వ్యవసాయం

–సేంద్రియ సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలి.!
–జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు

తిరుపతి, మే 23 ప్రభాతవార్త:



మారుతున్న మానవ జీవన విధానాలను అనుసరించి ప్రస్తుత వ్యవసాయ విధానాలను మార్చుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు రైతులకు సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తమ పరిధిలోని రైతులను ఒప్పించి కొంత మేరకు సేంద్రియ సాగు చేపట్టే విధంగా కృషి చేయాలన్నారు. అదేవిధంగా ఏఓ విజయభాస్కర్ మాట్లాడుతూ రైతుల వ్యవసాయ భూములలో భూసార పరీక్షలను శాస్త్రీయ పద్దతుల ద్వారా సేకరించి, పరీక్షల ఫలితాలను రైతులకు వివరించాలన్నారు. ఏపిఆర్ఎఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులకు వెంటనే చేయాలన్నారు. అంతకుముందు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రతి రైతు కొంత మేర విస్తీర్ణంలో తప్పనిసరి సేంద్రియ సాగు చేపట్టాలని అన్నారు. తద్వారా మానవ ఆరోగ్యంతో పాటు నేలతల్లి ఆరోగ్యాన్ని కాపడటమే కాకుండా సుస్థిర వ్యవసాయం సాధించవచ్చున్నారు. అనంతరం శాస్త్రవేత్తలచే ఎంపిక చేయబడిన రైతులకు వేపనూనె, సజ్జ విత్తనాలను పంపాఇణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిసిఎన్ఎఫ్ డిపిఎం షణ్ముగం, శాస్త్రవేత్తలు వేమన, రెడ్డిరామ్, రాజేష్, ఏడిఏ మనోహర్ బాబు, ఏఈఓలు అమీర్, భరత్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి సహకరించండి.!

రామచంద్రాపురం, మే 23 ప్రభాతవార్త:



రాయలచెరువు సమీపంలోని ఛాయాపురంలో నిర్మిస్తున్న మహా మండలేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని ఆలయ ధర్మాధికారి ఉంగరాల సుబ్రమణ్యశర్మ కోరారు. శనివారం శనైశ్చర స్వామికి టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి సతీమణి మాదవి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహామండలేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణానికి రూ.1,19,000/-లు విరాళం అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనైశ్చర, అభయాంజనేయ స్వామి, మహామండలేశ్వర స్వామి ఆలయాలను ఒకే ప్రదేశంలో నిర్మించడం సమీప గ్రామప్రజల పూర్వజన్మ సుకృతమన్నారు. ఆలయ నిర్మాణానికి దాతలు తమవంతు సహాయసహకారాలు అందించి స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై దేవేరులతో శ్రీనివాసుడు

తిరుపతి రూరల్, మే 23 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీనివాసుడు తన దేవేరులతో తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓయం.గోపినాద్, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యస్వీయూలో డ్రోన్ ప్రయోగం విజయవంతం

తిరుపతి విద్య, మే 23 ప్రభాతవార్త:



ఎస్వీయూ లో శనివారం అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన గగన యంత్రం విజయవంతంగా ప్రయోగించారు. భూమి, నీటి వనరుల నిర్వహణలో ప్రతిభా కేంద్రం ఆధ్వర్యంలో ఉన్న ప్రత్యేక ప్రాజెక్టు నిధులతో ఈ గగన యంత్రాన్ని కొనుగోలు చేసినట్లు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు.భూభాగం మరియు నీటి వనరుల పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేయడం ఈ గగన యంత్రం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గగన యంత్రం ద్వారా సేకరించే చిత్రాలను భౌగోళిక సమాచార విధానం, దూర పరిశీలన సాంకేతిక పద్ధతుల సహాయంతో విశ్లేషించి భూమి వినియోగం, నీటి వనరుల మార్పులు, భూగర్భ జలాల పరిస్థితి, సాగునీటి వినియోగంపై ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించనున్నట్లు వివరించారు.అలాగే ఈ సాంకేతిక పరిజ్ఞానం వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణ, ప్రకృతి విపత్తుల అంచనా వంటి పలు రంగాలకు ఉపయోగపడనుందని తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించడంతో పాటు పరిశోధనలకు ఇది ఎంతో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి టాటా నరసింగ రావు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నీటి వనరుల సంరక్షణ, భూభాగ నిర్వహణలో విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రెక్టర్ అప్పా రావు , రిజిస్ట్రార్ భూపతి నాయుడు కూడా పాల్గొని పరిశోధనలకు ఈ గగన యంత్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.అదేవిధంగా ప్రతిభా కేంద్ర సమన్వయకర్తలు ఎన్ . చంద్రాయుడు , మునిలక్ష్మి తో పాటు ప్రాజెక్టు సిబ్బంది, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 125 మంది గైర్హాజరు

తిరుపతి విద్య, మే 23 ప్రభాతవార్త :



తిరుపతి జిల్లాలో శనివారం నిర్వహించిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు ప్రాంతీయ తనిఖీ అధికారి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా జరిగిన పరీక్షలకు మొత్తం 125 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వెల్లడించారు.ఉదయం జరిగిన పరీక్షలకు 407 మంది విద్యార్థులు కేటాయించగా, 365 మంది హాజరై 42 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 899 మంది కేటాయించగా, 816 మంది హాజరై 83 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసి, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షలను సజావుగా నిర్వహించినట్లు రాజశేఖర్ రెడ్డి వెల్లడించారు.

